# ఆద్యంతాల మధ్య

"డియర్ గాయత్రీ!

నేను, పిల్లలు పన్నెండో తారీఖు పశారాలో వస్తున్నాం. బస్సులో ప్రయాణంచేసి, రోడ్డుదగ్గర దిగాక, నీవుపంపే వాహానంలో నీ దగ్గరకు వస్తాను......

నీ

''వసుంధర''

ఇన్‌లాండ్ కవరు ఆత్రంగా విప్పిన నాకు అందులో వ్రాసివున్న రెండేరెండు వాక్యాలు, ఆనందాన్నీ, ఆశ్చర్యాన్నీ కూడా కల్గించాయి. షుమారు ఆరునెలల తర్వాత, వసుంధర దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరం ఇంత క్లుప్తంగా వుంటుందని ఊహించలేకపోయాను! అది ఇంత ముక్తసరిగా ఉత్తరాలు వ్రాస్తుందని కూడా నాకు తెలియదు! టెలిగ్రాంలా వున్న వుత్తరాన్ని మరోమారు చదివాను. ఏదో అసంతృప్తి ఆవరించిం దొక్కసారిగా!

వాయువేగ మనోవేగాలు అధిగమించేలా, ఫుల్‌స్టాప్ లేకుండా మాట్లాడే వసుంధర, ఇరుగుపొరుగుల, ఇంట్లో వారందరిమీదా, వారి పద్ధతులమీదా, నిశిత విమర్శలు, సలహాలు, చికాకులు, వ్యాసాల్లా పదిహేను పేజీలకు తక్కువ

కాకుండా తన భావావేశాలకు భాష కల్పించి వ్రాసే వసుంధర, రెండే రెండు వాక్యాలు వ్రాసింది !

పోనీ ప్రయాణపు హడావుడేమో? ఎటూ బయల్దేరి వస్తోంది కాబట్టి అన్ని సంగతులు విపులంగా మాట్లాడుకోవచ్చు ననుకుందేమో ! అయినా హఠాత్తుగా ఈ ప్రయాణమేమిటి? దాని పుట్టినింటికిగానీ, మరే బంధువుల దగ్గరకు గానీ వెళ్లే ఆస్కారమూ లేదు ! ఆ మార్గాలలో మావూరూ లేదు ! ప్రత్యేకంగా పనిగట్టుక రావాల్సిందే ! ఊహ్ ! లేనిపోని కుశంకలు కాబోలు నావి ! నన్ను చూడాలనిపించిందేమో ?

ఎంత సమాధాన పరుచుకుందామని ప్రయత్నించినా ఆ కారణం సబబుగా తోచటం లేదు ! మధ్యప్రదేశ్ నుంచి నెల్లూరు జిల్లాలో మారుమూల గ్రామంలో వున్న నన్ను వెతుక్కుంటూ ప్రయాణపు ఖర్చులు పెట్టుక, పనిగట్టుక రావాల్సిన అవసరం ఆర్థికస్తోమతూకూడా వసుంధరకు లేవే ?

'గాయత్రీ!' శ్రీవారి పిలుపుతో ఆలోచనలు చెల్లా చెదరై పోయాయి.

'ఎక్కణ్నుంచి ఉత్తరం!' అడిగారు శ్రీవారు.

'మా వసుంధరదగ్గర్నుంచి...వసుంధర గుర్తుందామీకు?'

'ఆ...! ప్రేమించి పెళ్ళాడిందనీ......'

'ఆఁ! ఆఁ! ఆవిడే !'

'ఏమని వ్రాసిందేమిటి ?' అన్నారు టవల్, సబ్బూ తీసుకుంటూ !

'పన్నెండో తారీకు వస్తోందట !'

"వెల్ ! నీ యిష్టమొచ్చిన రీతిలో, నీ యిష్టప్రకారం నీ స్నేహితురాలికి ఘనస్వాగతం ఇవ్వు! అంతగా ఆవిడ ఇబ్బంది పడ్తుందేమోనని సందేహముంటే, ఆ రెండురోజులూ నేనేదేనా 'కాంప్' వేసుకుంటాను సరా!" బాత్ రూం వేపు వెళ్ళి పోయారు.

శ్రీవారి విశాల హృదయానికీ, సంస్కారానికీ, మనసు లోనే జోహార్లర్పించాను !

మనసు నెంత మందలించినా మళ్ళీ అర్థంలేని ఆలోచనల వేపే పరిగెడుతోంది... అలా ఆలా గతంలోకి పరుగు తీసింది కళ్ళెంవదిలిన గుర్రంలా !

స్నేహమనేది అందమై, అతి సున్నితమై, కమ్మని పరి మళాలు వెదజల్లేపూలతీగెల్లాంటిది. జీవితంలో తారసపడే అందరి లోనూ, స్నేహాలత అల్లుకుపోదు. ఏ ఒకరిద్దరితోనో ఆ స్నేహ లత ప్రగాఢంగా హత్తుకుపోతుంది. అందుకే చెలిమి విలువలేని దంటారు. చదువు చాలించేవరకూ స్నేహితులుగా వున్న నేను, వసుంధర, పెళ్ళయ్యాక కూడా ప్రాణస్నేహితులుగానే మిగిలిపోయాం. అందుకే, మధ్యప్రదేశ్ లో అదివున్నా, ఆంధ్ర ప్రదేశ్ మారుమూలలలో నేనున్నా మాఇద్దరి పవిత్ర స్నేహానికి చిహ్నంగా, ఉత్తరాల ద్వారా స్వచ్ఛమైన స్నేహఝరి ప్రవ హిస్తూనేవుంది ... కానీ ఎంచేతో ఆరునెలలుగా హఠాత్తుగా వసుంధర దగ్గర్నుంచి ఉత్తరాలు రావటం మానేసాయి. ఐదారుమార్లు నేనే వ్రాసాను జాబులు ! జవాబు రాకపోవ టంతో విసిగి వేసారి మానేసాను !

హఠాత్తుగా ఈ ప్రయాణం! ఒకవేళ దాని భర్త గోపాలరావుకూ, వసుంధరకూ మధ్యేదేనా కలతలు వచ్చాయేమో! ఛీ...ఛీ ... అలా వుండదు! అందునా ఇద్దరూ ప్రేమించి, పెద్దల నెదిరించి మరీ చేసుకున్నారు కూడాను!

వసుంధర పెళ్లి ఎంత గుట్టుగా జరిగిపోయిందో! వాళ్లింటి మేడగదిలో బాడుగకు చేరాడు గోపాలరావు. అక్కడే ఓ చిన్న ప్రైవేటు కంపెనీలో గుమస్తా వుద్యోగం చేస్తుండేవాడు! ఒక ఇంట్లో వున్న కొద్దిపాటి పరిచయం, ప్రణయంగా మారింది. వాళ్లిద్దరి ప్రణయాన్ని గురించిన లేని పోని పుకార్లు వినలేక చెవులు మూసుకునేదాన్ని!

ఒకరోజు మా ఇంటికి వచ్చింది.

"ఏమిటే వసూ! ఇలా అల్లరిపడేకంటే అతగాణ్ణి పెళ్ళి చేసుకోరాదూ?" అన్నాను మందలిస్తూ.

"ఉద్దేశ్యం అదే! కానీ అందుకు అమ్మా, నాన్నా, అన్నయ్యా ససేమిరా అంటున్నారు..." అంది నవ్వుతూ.

"మరి పరిష్కారం?" అన్నాను అయోమయంగా.

"గప్‌చిప్‌గా పెళ్ళి చేసుకోవడం..." అంది తేలిగ్గా, వెళ్ళటాని కుద్యుక్తురాలౌతూ!

దాని ధైర్యానికి విస్తుపోతూ నిల్చుండి పోయాను. అన్నంతపనీ చేసింది. మూడోనాటికల్లాగుళ్ళో గుట్టుచప్పుడు కాకుండా పెళ్లి చేసుకుని వచ్చారు గోపాలరావు, వసుంధర. వాళ్లింట్లో పెద్దగొడవే అయ్యిందారోజు!

"నాకూతురు పురిట్లోనే చచ్చిందనుకుంటాను...నీపెళ్లి నీకై నీవే నిర్ణయించుకునేంత ఆరిందావై పోయావు ... ... అందులోనూ మన కులంవాడుకూడా కాదతగాడు... వెళ్ళు... నాకు నీ ముఖం చూపించకు!" అందిట వాళ్ళమ్మ. చేతుల్లో ముఖందాచుకుని ఏడుస్తూ.

సహజ గంభీర స్వభావులైన వసుంధర నాన్నగారు మాత్రం "వెళ్ళు!" అన్నారట.

"ఏం? ఇంకా చెయ్యాల్సిన ఘనకార్యా లేమైనా వున్నాయా? మేం నలుగురిలో తలెత్తుకు తిరక్కుండా చేసావ్ చాలదూ?" వసుంధర అన్నయ్య ఛీత్కారంచేస్తూ వెళ్లి పోయాడట!

తాత్కాలికంగా వారంరోజులు మా ఇంట్లో, వసుంధ రకూ, గోపాలరావుకూ ఆశ్రయమిచ్చానన్ని, నన్నూ శ్రీవారినీ కూడా తిట్టిపోశారు వసుంధర అమ్మా నాన్నా, అన్నయ్యలు!

తర్వాత గోపాలరావుకు మధ్యప్రదేశ్‌లో హోషంగా బాద్‌లో ఏదో ప్రైవేటుఫరమ్‌లో ఉద్యోగం వచ్చింది. ఇద్దరూ వెళ్ళిపోయారు.

దూరంవెళ్లినా, దాని దాంపత్యజీవితంలోని ఏఘట్టాన్నీ నా దగ్గర దాచలేదు వసుంధర!

"వారేమంటారో తెలుసా గాయత్రీ? 'వసూ! నీకళ్లు నన్ను బంధించివేసాయి. ఆ బంధాలు మరి విడిపించుకోలేక, నావాళ్ళందర్నీ దూరం చేసుక, ఇంతదూరం నిన్ను తెచ్చు కున్నాను చూశావా?' అంటారు! గాయత్రీ! ఏం చెప్పను?

అలా వారంటూంటే ఎంత సిగ్గుముంచుకొస్తుం దనుకున్నావ్ ? ఏమో బాబూ! అలాటి సమయాల్లో నా పెదవులు కూడా విడిపడవు మాటలు కరువయి! అందుకే వారే అంటారు మళ్ళీ! 'వసూ! ఇప్పుడెంత మూగపిల్లలా నటిస్తున్నావ్ ? ఇప్పుడెన్ని కబుర్లు చెప్పావు కళ్ళతోనే ?' అంటూ గాయత్రీ! తల్లీ తండ్రీ, కనీ పెంచి పెద్దచేస్తారు. అన్నదమ్ములు అభిమానిస్తారు. అక్కచెల్లెళ్లు వాత్సల్యం కురిపిస్తారు. కానీ భర్త అనురాగంలో, తలిదండ్రుల, స్నేహితుల, బంధువుల, ఆత్మీయుల అందరినుంచీ మనం పొందే అనుభూతికంటే, ఎక్కువైన, ఏదో తెలియని మధురానుభూతి నిండి వుందనీ, అదే దాంపత్య జీవితంలోని రహస్యమనీ, నేను అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను. మనదేశం కాదు, మన భాషకాదు...ఇంత దూర ప్రాంతంలో, పుట్టింటి ఆశకూడా పోగొట్టుకున్నాననే ఆవేదన లేదు! వీటన్నిటిమించిన ఆనందం ఒక్క వారి చిరునవ్వులో చూడగలుగుతున్నాను. వారి బాహుపరిధిలో, కాలచక్ర భ్రమణంకూడా నాకు తెలియటంలేదు. వారాలు నిముషాల్లా, నెలలు రోజుల్లా గడిచి పోతున్నాయి." అని వ్రాసిందో వుత్తరం.

"గాయత్రీ! వారంరోజుల క్రితం ఓ చిన్న తమాషా జరిగింది. వ్రాయనా? చదివి నవ్వుకోకూడదు సుమా! నైలాన్ చీరె, జాకెట్టు, రెండు జడలూ, రంగులు వేసుక తనతోబాటు ఓ టీపార్టీకి రమ్మన్నారు! అదేమిటో అలాటి వేషమంటే నా కసహ్యాం మొదటే చెబితే ఒప్పుకోరని, తీరా బయల్దేరే సమయానికి, వదులుగా ఒక జడా, మామూలుగా నే

కట్టుకునే వెంకటగిరి జరీచీరె, చేనేత జాకెట్టూ వేసుక బయటికి వచ్చాను ... ఆయనగారికెంత కోపం వచ్చిందో తెలుసా ? ప్రక్కనే ఆయనగారి స్నేహితుడులేకుంటే, అమాంతం నన్ను నమిలిమింగే వారేమో ! ఎలాగో కోపం మింగుకున్నారు. కాని ఆ కళ్ళల్లో నిప్పుల రవ్వలున్నాయని నాకు తెలుసు. ఇంటికి రాగానే మౌనవ్రతం ఆరంభించేసారు. భోజనం మానేసారు. ఎంతగానో నచ్చచెప్పాను. ఊహుఁ! వినిపించుకోలేదు. నాకూ చెడ్డకోపం వచ్చేసింది. "మీకేనా అలగటం సాధించటం చేతనైంది ? అలాటి బట్టలూ, అలంకరణ అంతా మీ కిష్టమైతే మీ ఎదురుగా ఇంట్లో కట్టుకుంటాను. కానీ పబ్లిక్ ఫంక్షన్స్‌కు వెళ్ళేటప్పుడలా అర్ధనగ్నంగా తయారుకావటం నా కిష్టంలేదు. ఈ పూటనుంచీ నేనూ అలుగుతాను, నేనూ భోజనం మానేస్తాను...." అన్నాను... అన్నంతపనీ చేసాను. అంతే. మర్నాడు మధ్యాహ్నం శ్రీవారు రాజీకొచ్చేశారు, నీ కిష్టంలేకపోతే బలవంతం చెయ్యనులె ! అంటూ !

అవునుమరి ! మగాళ్ళకేనా యిష్టాయిష్టాలు ? మనకు లేవా ? వాళ్ళెలా చెబితే అలా అభిమానం చంపుకునేందుకు సిద్ధపడాలా ఆడది ? అసలు మగవాళ్ళనుకొని లాభం లేదు గాయత్రీ ! వాళ్ళాడింది దాటగా, పాడింది పాటగా, వంతపాడి, తాళంవేసే స్త్రీ లెంతమందో వున్నారు ? ఇలాటి ఆడవాళ్ళ అలుసు చూచుకునే మగవాడలా రెచ్చిపోతాడు .. అవునా ?"

పొట్ట చెక్కలయ్యేలా నవ్వారు శ్రీవారు, నా వెనుక నిల్చుని నాకు తెలియకుండా ఆ ఉత్తరం చదివి !

బాబు పుట్టాడు. అచ్చు శ్రీవారి పోలికలే వచ్చాయి. "నా తెలివి తేటలు రావాలి నా బాబుకు!" అన్నాను గర్వంగా! ఇల్లెగిరిపోయ్యేలా నవ్వారు - "ఇక వాడు బాగుపడ్డట్లే!" అంటూ! ఏం గాయత్రీ! నువ్వు చెప్పు. నా తెలివితేటల కేం లోటు? ప్రతిక్లాసులో ఫస్టుమార్కులు తెచ్చుకోలేదూ? మేడమ్స్, టీచర్లు, ఎంతగా మెచ్చుకునేవారో నన్ను, నీకు గుర్తుందికదూ? అది సర్లే! అమ్మా నాన్నా వాళ్ళకు నా మీదెంత పంతమో చూచావా? తొలి కాన్పుకదా? పిల్చికెళ్ళ లేదు సరికదా కనీసం బాబు పుట్టాడని జాబువ్రాసినా జవా బివ్వలేదు! పోనిద్దూ! ఎవరి పంతాలతో, పౌరుషాలతో నాకేం పని? కొండలా నా అండగా వారుండగా నాకేం భయం?" అని వ్రాసిందోసారి!

"కాన్పురోజులు దగ్గరకొస్తున్నాయి. ఫామిలీ ప్లానింగ్ అమలు జరపాలని వుంది.... మరి నీ సలహా ఏమిటి గాయత్రీ?" ఆరు నెలల క్రితం వ్రాసిన జాబది!

"ఇది మరీ బావుందే వసూ! మధ్య నా సలహా ఏమిటి? మీ వారితో చర్చించుకొని పరిష్కరించు కోవలసిన సమస్య అది..." అని జవాబిచ్చాను! "పాప పుట్టింది! బొద్దుగా తెల్లగా చాలా బావుంది." అదే ఆఖరు జాబు... మళ్ళీ ఈ జాబు...

"గా య త్రీ! ఇప్పుడు నిద్రపోతున్నావేమిటి?" శ్రీవారి స్పర్శ, పిలుపూ, ఉత్తరాలలోకంలో విహరిస్తున్న నన్ను మామూలు లోకంలోకి గిరాటు వేసాయి.

వాకిట్లో బండి ఆగింది. ఆత్రంగా పరుగెత్తికెళ్ళాను. వసుంధరకొడుకు నాలుగేళ్ళ బాబు దూకాడు బండిలోంచి. వసుంధర దిగి, పాపను దించుకుంటోంది.

"రా, వసూ!" ఎదురువెళ్ళిన నాకు షాక్ తగిలి నట్లయింది.

వచ్చింది వసుంధరకాదు... వసుంధర రూపంలో వున్న అస్తిపంజరం! గులాబిరంగు దేహచ్ఛాయతో, అందంగా బలిష్ఠంగావుండే ఆ వసుంధరకూ, కళ్ళు పీక్కుపోయి, జుట్టు రాలిపోయి, పాలిపోయిన శరీరంతో జీవచ్ఛవంలావున్న ఈ వసుంధరకూ ఎక్కడా పోలికలే లేవు. "అలా చూస్తావేం గాయత్రీ? నేనేలే! దెయ్యాన్ని కాదు!" అంది వసుంధర నవ్వుతూ. దవడలు బాగా లోతుకు పోవటంవల్ల బయటపడుతున్న పళ్ళను దాచుకోటానికి ప్రయత్నిస్తూ.

"ఇదేమిటి వసూ! ఇలా అయిపోయావ్? సుస్తీ చేసిందా? నాకు వ్రాయలేదేం? ఆరు నెలల తర్వాత ఈ అర్ధాయుష్షు జాబేమిటి? మీ వారేరీ?"

"ఇలాగే వాకిట్లో నిలబెట్టి ప్రశ్నలవర్షం కురిపిస్తుం టావా? ఇంట్లోకి రానిస్తావా? లేదా?" అంది వసుంధర అలాగే వికృతంగా నవ్వుతూ! నా ప్రవర్తనకు సిగ్గువేసింది. అందరం లోపలికెళ్ళాం.

భోజనాలుకాగానే, శ్రీవారు ఆఫీసుకు వెళ్ళిపోయారు. హాల్లో చాపలు పరిచాను. వసుంధర పిల్లల్ని నిద్రపుచ్చింది.

"ఇప్పుడు చెప్పు వసూ! హఠాత్తుగా నన్ను చూడాలని అనిపించిందా? లేక ఈ ప్రయాణం మరేదేనా అవసరం మీదా?" అన్నాను వసుంధరపక్కనే చాపమీద కూర్చుంటూ. వసుంధర గోడకానుకొని కూర్చుని, తమలపాకులకు సున్నం రాచి చీల్చుతోంది.

"పలకవేం వసూ?" అన్నాను మళ్ళీ.

"అబ్బబ్బ! యక్షప్రశ్నలు నీలోనుంచే పుట్టాయల్లేవుందే గాయత్రీ! ఊపిరి సలుపుకోనివ్వవుకదూ?" అంది దుర్భరంగా నవ్వుతూ.

కాస్సేపాగి తానే అంది "కొంత కాలంపాటు నా పిల్లల్ని నీ దగ్గర వుంచుతాను గాయత్రీ! జాగ్రత్తగా చూచుకుంటావుగదూ? మీ వారిని వప్పించ గలవా?"

ఈ మాటలంటూండగానే వసుంధర కళ్లు ఆర్ద్రాలయ్యాయి.

"నీ పిల్లల్ని నా దగ్గరుంచుకోవాలా? ఎందుకు? అసలేం జరిగింది వసూ? కొంపదీసి మీ వారితో దెబ్బలాడి, అలిగి రావటం లేదుగదా?" ఆదుర్దా దాచుకోవాలన్నా దాగలేదు నాలో!

"వారితో దెబ్బలాడటంమాటెలా వున్నా, విధి నాతో దెబ్బలాడింది గాయత్రీ!" అంటూనే భోరున ఏడ్చింది వసుంధర...

నాకేమీ పాలుపోవటం లేదు!

ఎంతోసేపు అనునయించాక మెల్లిగా సంబాళించుకుంది వసుంధర.

"గాయత్రీ! ఆడవాళ్ళు తాము చాలా తెలివిగల వాళ్ళమనుకుంటారు. ఈ రోజుల్లో అయితే మరీనూ. తమ సమస్యలన్నీ తామే పరిష్కరించుకోగల సమర్థులని కూడా గర్విస్తారు. కానీ... కానీ గాయత్రీ! ప్రపంచంలో తెలివితక్కువ ప్రాణులంటూ ఏవేనా వుంటే— అవి స్త్రీలే!" హఠాత్తుగా గంభీరంగా మారిపోయింది వసుంధర.

ప్రపంచంలోని స్త్రీజాతిని గురించి వసుంధర వెలిబుచ్చిన దారుణమైన అభిప్రాయం నాకు చిరాకు కల్గించింది. తనను గురించో, లేక తనకు పరిచయమున్న, తనుచూచిన ఏ కొద్ది మంది స్త్రీలో అలాటివారై వుండొచ్చు... కానీ అందరు స్త్రీలూ అలాటివారేనని అనుకోవటం, అంతటితో ఆగక అదో సిద్ధాంతంగా రూపొందింప జేయటం నాకేమాత్రమూ నచ్చలేదు. ఆ మాటే తీవ్రంగా అందామనుకున్నంతలో వసుంధర వాక్ప్రవాహం నా ప్రయత్నాన్ని అరికట్టేసింది.

" 'నీకు విద్యా సౌకర్యాలు కల్పించాను' అంటాడు పురుషుడు! 'కాబోలు' అనుకుని మురిసిపోతుంది స్త్రీ. 'నీకు ఆస్తిలో వాటా యిచ్చాను' అంటాడు పురుషుడు. 'అవును' అంటూ అతడి పాదాలు మరింత భక్తితో పూజిస్తుంది స్త్రీ! 'నీకు ఉన్నతస్థానాన్నిచ్చి గౌరవిస్తున్నాను' అంటాడు పురుషుడు... 'జోహారు!' అంటూ ఆత్మార్పణ చేసుకుంటుంది స్త్రీ. కానీ ఆ ఆకర్షణలన్నీ చూపి పురుషుడు తనను మరింతబానిసగా చేసుకుంటున్నాడని గానీ, అతగాడి తియ్యటి మాటల బంగారు

సంకెళ్ళలో తను బంధింప బడుతోందని గానీ ఊహించలేక పోతోంది స్త్రీ !"

"వసుంధరా !" గట్టిగా అరిచాను. 'నీ ప్రయాణం ఎందాకా ?' అని నేనడిగితే, స్త్రీ, పురుషుల గుణగణాలను గురించి వర్ణిస్తున్నావా ?"

"కోప్పడకు గాయత్రీ ! నిజాలెప్పుడూ నిష్ఠూరంలానే వుంటాయి."

"ఏమిటా నిజాలు ?"

"ఈనాడు త్రిశంకు స్వర్గంలావున్న మన సమాజంలో, ఎన్ని చట్టాలొచ్చినా, ఎంత ప్రగతి సాధించామని గొంతు చించుకున్నా స్త్రీ జీవితం ఆద్యంతాల మధ్యే ఉండిపోతూంది. అటు పూర్వపు తరాల్లో కలవలేకా, ఇటు ప్రగతి పంథాలో ధైర్యంగా సాగలేకా !"

"ఇదో వసూ ! ఇంతకూ నీ సంగతి చెబుతావా ? లేక మనసమాజాన్ని గురించీ, స్త్రీల మనుగడను గురించీ ఉపన్యాసం ఇస్తావా ? అసలీ వ్యాఖ్యానాలకూ, నీకూ సంబంధమేమిటి ?" కోప్పడ్డాను.

"అదుగో అప్పుడే విసుగేస్తోంది నీకు..."

"లేదులే చెప్పు !"

"సరిగ్గా ఆరునెలల క్రితం నేను తెలుసుకున్న సత్యాలతో నే నలాటి సిద్ధాంతాలు ఏర్పరచుకున్నాను. వారిని గురించి నేపూర్తిగా తెలుసుకున్న నాడు..." వసుంధరకళ్లు అర మోడ్పు లయ్యాయి. బహుశా మనస్సు గతంలోకి మళ్ళిందేమో !

"గాయత్రీ! ఆ రోజు శుక్రవారం. వారు ఆఫీసుకెళ్ళి పోయారు భోంచేసి. బాబును నిద్రపుచ్చి, పాపను నాప్రక్కనే చాపమీద పడుకోబెట్టుకున్నాను. తలంటు పోసుకున్న జుట్టు విరబోసుకుని, ఆరబెట్టుకుంటూ, దిండుగలేబుమీద ఎంబ్రాయిడరీ చేస్తూ కూర్చున్నాను. 'స్వీట్ లవ్' అని వ్రాసి రకరకాల దారాలతో అందంగా కుట్టాను... ఓ మూలగా వసుంధర అని కుడదామనిపించింది. కార్బన్ పేపర్ అల్మైరాలోనుండి తెచ్చుకుందామని లేచాను... అప్రయత్నంగా వాకిలికేసి చూచాను. ఎదురుగా గేటు తెరుచుకుని ఎవరో స్త్రీ, ప్రక్కనే వయసు మీరిన బట్టతలాయనను వెంటబెట్టుకువస్తోంది. అలంకరణనుబట్టే గ్రహించుకోగలిగాను, ఆగంతకులు ఆంధ్రులని."

'గోపాలరావుగారిల్లిదేనా?' అన్నాడాయన.

"అవునండీ! లోపలికి రాండి. వారు ఆఫీసుకువెళ్లారు!" అన్నాను ఆవిడవేపు పరీక్షగా చూస్తూ. వయస్సేమంత ఎక్కువగా లేదు... కానీ వేదనా భరితంగా ఉన్నట్లున్న ఆమె మ్లానవదనం ఎక్కువ వున్నట్లు భ్రమింపజేస్తోంది. పెద్ద అందగత్తె కాకున్నా అనాకారి మాత్రం కాదు."

వరండాలోఉన్న కుర్చీతెచ్చుక గదిగడపదగ్గర స్వయంగా వేసుక కూర్చున్నాడాయన... ఆవిడ పాప పక్కన చాపమీద కూర్చుంది.

తెలుగువారికోసం ముఖంవాచివున్న నాకు వాళ్ళిద్దరి రాక ఎంతో ఆహ్లాదాన్ని కల్గించింది. కానీ ఎలా పరిచయం చేసుకోవాలో బోధపడటంలేదు.

"మీరు... వారి భార్యా? మీ పేరు?" అందావిడ నన్ను నిశితంగా చూస్తూ.

'అవును! వసుంధర!' మరి మాటలు దొరకలేదు.

'మీ పెళ్ళై ఎన్నేళ్ళయిందండీ?' అందావిడ పాపకేసి చూస్తూ.

"నాలుగేళ్ళు! ఆ బాబు, ఈ పాప, ఇద్దరు పిల్లలు" అన్నాను.

'ఉస్సురని నిట్టూర్చిందావిడ.'

'క్షమించండి! మీరెవరో తెలియటంలేదు.' అన్నాను నొచ్చుకుంటూ.

'నా పేరు రాజ్యలక్ష్మి. ఆయన మా నాన్నగారు... సీతాపతిగారు...నాకు ఇద్దరు పిల్లలు!'. అంటూండగానే ఆమె కళ్ళెందుకో సజలాలయ్యాయి.

నా కర్థంగాలేదు... వారివేపు బంధువులేమో? కానీ రాజ్యలక్ష్మి సీతాపతిగార్లనే బంధువులుగానీ, స్నేహితులుగానీ, కనీసం తెలిసిన వారయినా తనకున్నారని, వారెన్నడూ నాతో చెప్పలేదు.

'చూడమ్మా వసుంధరా! నువ్వూ ఆడదానివే! సాటి ఆడదాని బ్రతుకు బుగ్గిపాలు చెయ్యడం నీకు న్యాయమనే తోచిందా?' సీతాపతిగారు నావేపు పరీక్షగాచూస్తూ అన్నారు. ఆయన కంఠస్వరం ఎంత నెమ్మదిగా వున్నా, కటువుగానే ధ్వనించింది.

"మీరడిగేదేమిటో నా కర్థంగావటంలేదు బాబాయి గారూ!" త్వరగా వరసలు కలుపుకోవటం నాకో తెగులు!

"నా భర్తను నీవాడిగా చేసుకొనికూడా, ఇంకా అర్థం గానిదేమిటి?" తీక్షణంగా అంది రాజ్యలక్ష్మి!

ఆవిడభర్తను నావాడిగా చేసుకున్నానా? ఏమిటీ అర్థం లేని ప్రలాపన? అసలు వీళ్ళెవరు? నా తల గిర్రున తిరుగుతోంది!

"మీ భర్తా! ఎవరు?" పిచ్చిగా అరిచాను.

"గోపాలరావుగారు నా భర్త! అగ్నిసాక్షిగా తాళిగట్టిన భర్త! మాకు ఇద్దరు పిల్లలుకూడా కలిగారు! కానీ వారి కెప్పుడూ ఏదో అసంతృప్తి నా విషయంలో వుండేది! తా నూహించే అందం నాలో లేదనీ, ఆకర్షణలేదనీ అసంతృప్తి వెలిబుచ్చేవారు! పెద్దల వత్తిడివల్లమాత్రం ఎలాగో నన్ను కొంతకాలం భరించారు! రెండో పాపను గర్భిణిగా వుండగా, చెప్పాపెట్టకుండా వెళ్ళిపోయారు! వాకబుచేయగా, ఎక్కడో సజీవంగానే వున్నారనీ, ఉద్యోగం చేస్తున్నారనీ, వివాహం కూడా చేసుకున్నారనీ తెలిసింది! మీరెలా వారికి తటస్థపడ్డారో గానీ, నా భర్తను నా నుంచి పూర్తిగా వేరుచేసి నా బిడ్డలకు "తండ్రి" లేకుండా చేసి పుణ్యంకట్టుకున్నారు!"

నా కాళ్ళక్రింద భూమి కదిలిపోతోంది! ఇది కలా? నిజమా? కథా?

"అలా విస్తుపోతావేమమ్మా? ఒక నిండుకాపురాన్ని ధ్వంసం చెయ్యటానికి నీ కెలా మనసొప్పింది? మగవాడు చంచలస్వభావుడే కావచ్చు! ఆడదానివి నీ కామాత్రం ఆలో

చన లేకపోయిందా? అతగాడుతప్ప ప్రపంచంలో నీకు వరుడే కరువయ్యాడా? పైగా ఇద్దరు బిడ్డలతండ్రి!'' సీతాపతిగారు కోపంగా అరుస్తున్నారు. ఇక భరించలేక పోయాను!

"ఆగండి! మీరెవరో మీరనేదేమిటో నాకింకా అంతు బట్టటంలేదు! మీరేదో పొరపాటు బడ్డట్లున్నారు! నా భర్త పేరు గోపాలరావుగారే! కానీ మీరుచెప్పే గోపాలరావుగారు మాత్రం కాదువీరు! నా భర్తగారు, మా ఇంటి మేడమీద గదిలో అద్దెకుండేవారు. అప్పుడే మాకు పరిచయమైంది. వారు బ్రహ్మచారి అనికూడా మావాళ్ళందరికీ తెలుసు! కాకుంటే వర్ణాంతర వివాహానికీ, ప్రేమ వివాహానికీ మావాళ్లు అంగీకరించక పోవటంవల్ల మేము రిజిష్టర్ మారేజి చేసుకున్నాం! అంతే! మీ అల్లుడుగారు బహుశా ఇక్కడో, మరెక్కడో వున్నారేమో వాకబుచెయ్యండి!" అన్నాను తీవ్రంగా! అవును మరి! నా యింటికి వచ్చి నన్నూ నాభర్తనూ అవమానిస్తుంటే ఎలా సహించగలను?

"ఇదో ఈ ఫోటోలోవున్న గోపాలరావు నా అల్లుడు! ఇతగాడే ప్రస్తుతము నీ భర్త అవునో, కాదో, చెప్పు! తర్వాత మాదారిన మేముపోతాం!'' జేబులోనుంచి కార్డుసైజు ఫోటో తీసి నా ముందుకు గిరాటువేసారు సీతాపతిగారు. గబుక్కున చేతిలోకి తీసుక చూచాను! భూమి కంపిస్తోందో, ఆకాశం బ్రద్దలౌతోందో, నదీనదాలేకమై ఉప్పెనలే వురుకుతున్నాయో, క్షణకాలం ఆ భయంకరమైన, నగ్నసత్యాన్ని చూస్తూ ఏమైపోయానో నాకు తెలియదు! మళ్ళీ ఫోటోకేసి చూసాను. ఈ సారి ఆ రూపం మరింత స్పష్టంగా కన్పిస్తోంది.

టకప్ చేసుకుని, నొక్కులక్రాపు రేగి ముఖంమీదపడ్తుంటే, ఏదో సంతోషకరమైన ముచ్చట విని, విరగబడి నవ్వుతున్నారు వారు ! నవ్వేటప్పుడు సొట్టలుపడే బుగ్గలు మరింతగా గుంటలు పడి వున్నాయి. కళ్ళు మరింత చిన్నవయిపోయాయి. అంత మనోజ్ఞంగా, మధురంగా ఎవరు నవ్వగలరు ? వారే !

ఆ నవ్వులో నేనూ శృతిగలప బోయాను పరవశించి పోతూ...

"ఏమ్మా ? ఈ గో పా ల రా వు కా దా నీ భ ర్త ?" నమ్మకమూ, అపనమ్మకమూ, ఆతురతా, తీవ్రతా, సవాలూ, భయాలూ సమ్మిశ్రితమైన ప్రశ్నవిని కంపించిపోయాను !

ఏమనిచెప్పను ? ఎలాచెప్పను ? కాదని ఏ ముఖంపెట్టుక చెప్పను? మధురహాసమని మురిసిపోయిన వారి ఆ నవ్వులో ఇంత కుట్ర దాగివుందా ? అమృతభాండమని భావించి నా ఎదకు హత్తుకున్న వారి హృదయంలో ఇంత వంచన దాగివుందా ? నన్నూ, నా సర్వస్వాన్నీ దోచుకున్న వారి వ్యక్తిత్వం వెనుక ఇంతకథవుందా? నేనెంతగా వంచింపబడ్డాను ? పుట్టింటివారినీ, పుట్టుక మొదలు గిట్టేవరకూ నా మేలు కోరేవారినీ ఎదిరించి, హేళనపాలుచేసి నేనుచేసిందేమిటి ? ఒక గృహిణికీ, ఆమె బిడ్డలకూ ద్రోహమా ! నా ప్రేమపూరిత హృదయాన్ని దాచి దాచి ఇలాటి ధూర్తుని కర్పించానా ?

"ఏమండీ వీరుకారా మీ భ ర్త ! మేం పొరబడ్డామా !" రాజ్యలక్ష్మి జాలిగా అడుగుతోంది...

"మీరు పొరపడ లేదు...... నేనే మోసగింప బడ్డాను! వీ రే నా భ ర్త! వీ రే మీ అల్లుడుగారు బాబాయిగారూ...వీ రే మీకు భ ర్త రాజ్యలక్ష్మిగారూ!" ఇక నా దుఃఖం ఆగ లేదు!

అందాకా తీవ్రంగా వున్న తండ్రికూతుళ్ళిద్దరూ నా దుఃఖం చూచి కాబోలు, కొంత ఆశ్చర్యపడ్డారు. కొంత కలవర పడ్డారు. చాలా సేపటికి నన్ను నేను సంబాళించుకున్నాను.

"అవునండీ! మీరు నమ్మండి, మానండి! కానీ నాకి వేవీ తెలియవు! ఈ నిముషంవరకూ వారు మరో స్త్రీకి భ ర్తఅని గానీ, మరో ఇద్దరు అమాయక బిడ్డలకు తండ్రిఅనిగానీ నాకు తెలీదు! నిజంగా తెలీదు!" మళ్ళీ దుఃఖం కమ్ముకువచ్చింది నాకు.

"ఎంత మోసం జరిగిందమ్మా? నీకు తెలిసే, కపట నాటక మాడుతున్నావని నేనూహించాను...." అన్నారు సీతాపతిగారు! బహుశా నా మాటల్లో, నా హృదయంలో కూడా కపటంలేదని ఆయన గ్రహించారేమో!

నా దుఃఖం ఆగ లేదు! పొగిలి పొగిలి పైకి వస్తోంది. ప్రక్కనున్న వృక్షాన్ని ఆలంబనగాచేసుకుని అల్లుకుని, అందంగా పూవులు పూచి పరిమళం వెదజల్లుతున్న లత నొక్కసారిగా కూకటివ్రేళ్ళతో పెకలించినట్లయ్యింది నా బ్రతుకు!

"ఐదేళ్లనుంచీ అతగాడికోసం వెతుకుతున్నాం. ఆరా తీస్తున్నాం. ఈ మధ్య ఆధారాలతోసహా తెలిసింది... కేసు పెడతానన్నా..." తండ్రిమాట పూర్తిగాకుండానే, అంది రాజ్యలక్ష్మి...

"...నేనే వద్దన్నాను వసుంధరా! ఎంతచెడ్డా వారు నా భర్త! వారిమీద కేసుపెట్టి కోర్టులకెక్కి నేను సాధించే దేమిటి?" అంది రాజ్యలక్ష్మి.

ఆ 'వసుంధరా!' అనే పిలుపులో ఇందాకటి కాఠిన్యం లేదు! ఏదో జాలీ, సానుభూతీ పొంగిపొర్లుతున్నాయి.

"భర్త వదిలిన ఆడదానికయినా, భర్త నొదిలిన ఆడదానికైనా, సంఘం ఇచ్చే గౌరవమేమిటో, లోకం చూపే ఆదరణేమిటో నాకు తెలుసు! నే ననుభవించానుకూడా! కనీసం నువ్వొప్పుకుంటే, నా పిల్లల్ని తెచ్చుక, మీ దగ్గరే ఏదేనా పని పాటలు చేసుకుంటూనయినా వుంటాను! వారి పంచలో పని మనిషిగా బ్రతుకుతున్నానన్న తృప్తేనా మిగులుతుంది నాకు! అందుకే మావాళ్లందరూ వారించినా, మా నానన్నను తోడు తీసుకవచ్చాను..." రాజ్యలక్ష్మి ఇక చెప్పలేక నోటికి పమిటె కొంగు అడ్డంపెట్టుకుంది. ఆతండ్రి ఈ హృదయవిదారకదృశ్యం చూడలేకపోయాడు కాబోలు... ఉమ్మి వేసుకునే నెపంతో గేటు బయటికి వెళ్ళాడు.

కంపించిపోయాను! పాపం! రాజ్యలక్ష్మి! నా లానే ఒక అమాయకపు ఆడది! కట్టుకున్నభర్తను దైవముగా నమ్ముకున్న ఆడది! అతడి పాదాలదగ్గర పురుగులాఅయినా బ్రతకాలనే ఆంకాంక్షతో వున్న ఆడది! ఇంతదూరం అతణ్ణి వెతుక్కుంటూ వచ్చింది! తన సర్వస్వమూ, తన హక్కుఅయిన సంపదను నేను దోచుకుంటే, స్వంత సొమ్ములో కనీసం కొంత వాటాయిమ్మని ప్రాధేయపడుతోంది!

నిజానికీ క్షణంలో నా స్థానమేమిటి? పరాయిస్త్రీ భర్తను, నన నాకర్షించుకునేలా చేసి, ఆ గృహిణి హృదయాన్ని ప్రయ్యలుచేసే "కులట"కూ నాకూ భేధమేమిటి? ఒక్క 'తాళి' మాత్రమే!

"పోనీ అదైనా మేలేనమ్మా! మీ యిద్దరూ ఒకేచోట వుంటూ సఖ్యంగా కాలం దొర్లించుకోండమ్మా!" అంతకంటే పరిష్కారం తోచని ఆ తండ్రి వాపోతున్నాడు!

చాలాసేపు ఆలోచిస్తూ కూర్చుండిపోయాను. పెను తుఫాను తాకిడికి చెట్లూ, కొమ్మలూ విరిగిపడి, ఆకులలములు రాలి, పిడుగుపాట్లతో బ్రద్దలయిన భూమితో, ఆ విలయం తగ్గాక స్థంభించిపోయిన ప్రకృతిలా మారింది నా హృదయం. కళ్ళనీళ్ళు కారికారి ఆగిపోయాయి. వెక్కిళ్లు ఎగసిఎగసి సమసి పోయాయి. గుండె పగిలి పొగిలి బీటలువారిపోయింది. మనసు వికలమై, విరిగిపోయింది! నాకేమీ కనిపించటంలేదు! నాకేమీ వినిపించటంలేదు! నాక్కనిపిస్తున్నది ఇద్దరే ఇద్దరు! బాబు, పాప! నాకు వినిపిస్తున్నది రాజ్యలక్ష్మి హృదయాక్రందన, జాలిపూరిత అభ్యర్థనా! అంతే. నా చుట్టూ రా గాఢాంధకారం!

హఠాత్తుగా ఒక నిర్ణయాని కొచ్చాను.

"బాబాయిగారూ! సర్వం కోల్పోయాను! జీవితంలో సర్వవిధాలా నాశనమయ్యాను. కనీసం అక్కయ్య బ్రతుకైనా బాగుచెయ్యటానికి ప్రయత్నిస్తాను. అన్నీ తెలిసికూడా ఇతరులకు హానిచేసేంతటి నీచురాలినని మాత్రం భావించకండి! మీరిక్కడే

ఏదేనా బస ఏర్పాటుచేసుక వుండండి! వారొచ్చే వేళయింది! మీరు వెళ్ళిరాండి..."

ఐదారు నిముషాలు తండ్రి—కుమార్తె లిద్దరూ మౌనంగా ముఖముఖాలు చూచుకుంటూ కూర్చుండిపోయారు....

"నా మాటల్లో ఇంకా నమ్మకంలేదా?" అన్నాను.

సీతాపతిగారు గబుక్కున నా దగ్గరగా వచ్చారు. నా తలమీద చేయివేసి వాత్సల్యపూర్వకంగా నిమిరారు. "తల్లీ! నా బిడ్డలాటిదానివి! నీ కెంత అన్యాయం జరిగిందమ్మా!" ఆయన గొంతు గాద్గదికమై పోయింది.

"వసుంధరా! మన పరిచయం కొద్దిసేపే అయినా నిన్నర్థంచేసుకో గలిగాను. మనిద్దరికీ ఒక్కరే భర్త! మన బిడ్డలకు వారే తండ్రి! మనమంతా ఒకేచోటవుందాం సరేనా?" అంది నావేపు ప్రేమగా చూస్తూ.

అత్యంత దుఃఖ సమయంలో గానీ అతి సంతోషకర సన్నివేశాలలో గానీ మనుషులు విచిత్రంగా ఆత్మీయు లౌతారు.

"చూద్దాం!" అనిమాత్రం అనగలిగాను.

వాళ్ళిద్దరూ వెళ్లిపోయారు.

*　　*　　*

రోజూలానే వారొచ్చారు. రాగానే బాబునెత్తుకుని దింపారు. పాపను ముద్దాడారు. నా దగ్గరగా వచ్చారు... ఏమిటో వారి వునికే నా కసహ్యాన్ని కల్గిస్తోంది.

"ఇదేమిటి వసూ? బాబుకింకా మంచి డ్రెస్ వెయ్యలేదేం? పాపకు స్నానంచేయించి పౌడర్ రాయలేదేం ? నువ్వేమిటి ? అశోకవనంలో సీతాదేవిలా జుట్టు విరబోసుకుని......" నవ్వుతున్న వారు వికృతంగా, రాక్షసునిలా కన్పిస్తున్నారు.

"ఏం వసూ ? నామీద కోపమొచ్చిందా ? ఈ దాసుడేం అపరాధం చేశాడనీ? ఏదీ నవ్వు... నవ్వవోయ్ ఒక్కసారి..." ఇక ఆ అభినయాన్ని భరించలేకపోయాను...

"నిజంచెప్పండి ! నన్నెందుకింత మోసంచేశారు ? మీకు ముందే వివాహమైంది. ఇద్దరు పిల్లలు కూడాను...అవునా ?" కటువుగా అడిగాను.

విద్యుద్ఘాతం పొందిన వారిలా కొయ్యబారిపోయారు.

"రాజ్యలక్ష్మి, వాళ్ళ నాన్నగారూ వచ్చారు..." అన్నాను.

తలపట్టుక కుర్చీలో కూర్చున్నారు. "వంచకులు—ధూర్తులు...దగాకోర్లు... నీచులు..." నా నోటికొచ్చినట్లు పరుషంగా తిట్టాను. ఏడ్చాను...సమాధానం చెప్పలేదు.

"రాజ్యలక్ష్మినీ, ఆవిడ పిల్లలనూకూడా మనదగ్గరే వుంచుకొనే పక్షములో మాత్రమే నేను మీ దగ్గరుంటాను..." అన్నాను.

ఏమనుకున్నారో ఏమో చప్పున అంగీకరించారు.

మర్నాడు రాజ్యలక్ష్మిని పిలిపించాను. వారినీ, రాజ్యలక్ష్మినీ ఏకాంతంగా వదిలేశాను. చాలాసేపు ఏదేదో వాదించు

కున్నారు. చివరికేమనుకున్నారో, గదిలోపలనుంచి ఇద్దరూ ప్రసన్నంగానే బయటికి వచ్చారు. రెండురోజుల తర్వాత సీతాపతిగారు, రాజ్యలక్ష్మి పిల్లలను తెచ్చి వదలి వెళ్లారు."

వసుంధర చెప్పటం ఆపింది. కన్నీళ్లు ధారాపాతంగా కారుతున్నాయి దాని కళ్ళ వెంట ; గత సంఘటనల తాలూకు ఉద్రిక్తతవల్లా, శరీరం దుర్బలంగా వుండటంవల్లా కాబోలు, విపరీతంగా ఆయాసపడ్తోంది...

"మరంకేం ? ఎలాగో సర్దుకోలేక పోయావా ?" అన్నాను, నా కన్నీళ్ళు 'కంట్లోనలక' సాకుతో తుడుచు కుంటూ.

"అలాగే కాలందొర్లి పోతుందను కున్నాను గాయత్రీ ! కానీ అలా జరగలేదు..." వసుంధర మళ్ళీ చెప్పటం మొదలెట్టింది.

"వారు అస్తమానూ నా వెంటే తిరుగుతారు. నన్నే ఆదరిస్తారు ... నాతోనే మాట్లాడ్తారు. ఎప్పుడో తప్పనిసరి అయితే తప్ప రాజ్యలక్ష్మితో ఒక్కమాటేనా పలకరు. నా బాబునూ, పాపనూ దగ్గరకు తీసినట్లు రాజ్యలక్ష్మి బిడ్డల నాదరించరు !"

'వసూ ! పెద్దవాళ్ళ వత్తిడివల్ల తాళికట్టానేగాని రాజ్యలక్ష్మి మీద నాకెలాటి మమకారమూ లేదు... మే మిద్దరం సఖ్యంగా వున్నామని పైకి చాటడానికి మాత్రమే ఎలాగో ఆ పిల్లలకు తండ్రినయ్యాను. అంతే ! కానీ నీ విషయంలో అలా కాదు ! నీలో నేనుకోరే సంపూర్ణత్వం నాకు కనిపించింది.

తప్పని తెలిసీ, మోసగించాను నిన్ను... కానీ నీ విషయంలో నేనేనాడూ చెడుగా ప్రవర్తించలేదే ?' అదీవారి సమాధానం.

ఎన్నోమార్లు, రాజ్యలక్ష్మి గోడచాటుగా కళ్లు తుడుచుకోవటం చూచాను. గుండెలు పిండినట్లయ్యేది. న్యాయంగా తనకు చెందవలసిన ఆనందాన్ని నాకు ధారపోసి, తనభర్త ఇంట్లోనే, తను పరాయిస్త్రీగా చెలామణి అవుతోందా అమాయకపు స్త్రీ. నాకేమీ తెలియకపోవచ్చు. వారు మోసమే చేసి వుండొచ్చు ! కానీ నా వల్ల మరో ఆడది, మానసికంగా యమయాతన పడుతోంది !

ఐదు నెలలుగా తల పగలగొట్టుక ఆలోచించాను. చివరకో నిర్ణయానికొచ్చేశాను. "నిజంగా నన్ను మన స్ఫూర్తిగా ప్రేమిస్తుంటే నాకో మాటఇస్తారా ?" అన్నాను వారితో.

"తప్పకుండా !" అన్నారు నా చేతిలో చెయ్యివేస్తూ !

"నన్నిప్పుడెలా చూచుకుంటున్నారో, ఇక మీదట రాజ్యలక్ష్మి నలాచూడండి... ఆమె బిడ్డల్ని ఆదరించండి..."

ఆశ్చర్యంగా, భయంగా నా వేపు చూచారు. "అంటే... నువ్వు... ?" ఏదో అడగబోయారు. అడ్డుతగిలాను.

"అవును... నేను, పిల్లల్ని తీసుక వెళ్ళిపోతాను !"

'ఎక్కడికి ?' భయంగా అడిగారు.

"ఎక్కడికో ! నేను మీ ఎదురుగా వున్నంతకాలం మీరు రాజ్యలక్ష్మి విషయంలో ఆసక్తి కనబర్చరు సరికదా ఆమెను నిర్లక్ష్యం చేస్తారు కూడా !"

"వద్దు వసూ, నువ్వెళ్ళొద్దు!" ఎంతగానో బ్రతిమాలారు! నా హృదయం కరగలేదు. కాఠిన్యమే వహించాను. ఈ ఐదు నెలలుగా చూస్తున్నాను... ఒక్కనాడయినా మన సారా రాజ్యలక్ష్మిని ఆదరించలేదు... అసలామె వున్నట్లు కూడా ప్రవర్తించలేదు! ఇంకా ఆమెకు పరోక్షంగా ద్రోహం చెయ్యలేను!

రాత్రంతా ఆలోచించాను... వారితో అన్నానేగానీ, పిల్లలతో ఎక్కడికి వెళ్ళాలి? నాతో అన్ని సంబాంధాలు త్రెంచుకున్న అమ్మా, నాన్న, అన్నయ్యలు, ఈ విధంగా నేను వెళ్తే నన్నాదరిస్తారా? భ్రమ! నా వివాహాన్ని గురించి చిలువలు పలువలుచేసి ప్రచారంచేసి హేళనచేసిన బంధువులు నన్ను దగ్గరకు తీస్తారా? ఊహుఁ! మరి ఈ ప్రపంచంలో నాకెవరున్నారు?

చటుక్కున నువ్వు గుర్తుకొచ్చావ్ గాయత్రీ! ఆనాడు అమ్మా, నాన్న, అన్నయ్యలు వెళ్ళిపొమ్మని చెబితే నీ యింట్లో తలదాచుకున్నాను ... ఈనాడు వారిదగ్గర్నుంచి బయల్దేరి నీ దగ్గరకువచ్చాను!"

వసుంధర గాఢంగా నిట్టూర్చింది.

'వసూ! మోసమే చేశానో, ఏం చేశానో, నేను నీకు భర్తను — ఆ పిల్లలిద్దరికీ తండ్రిని — అవసరమయితే ఎంత డబ్బు కావాలన్నా జాబు వ్రాయి. ఎప్పుడువస్తానన్నా నా హృదయపూర్వకంగా నిన్ను తెచ్చుకుంటాను— నీ ఆజ్ఞ మేరకు రాజ్యలక్ష్మిని ఆదరిస్తాను' అన్నారు మొన్న స్టేషన్‌లో, రైలు ఎక్కించి. వినబుద్ధిగాలేదు.

రాజ్యలక్ష్మి నన్ను కౌగలించుకొని గట్టిగా ఏడ్చింది. 'వసుంధరా నన్ను నువ్వూ, నిన్ను నేనూ, మనిద్దర్నీ వారూ, ఇలా ఎలాయితేనేం ముగ్గురం ఒకరికొకరు ద్రోహంచేసుకొన్నాం! పిల్లలు జాగ్రత్త! ఎప్పుడొచ్చినా ఎలా వచ్చినా ఈ అక్కయ్య నిన్ను మనసారా ఆహ్వానిస్తుందని మాత్రం మర్చిపోకు!' అంది.

గాయత్రీ! వచ్చేశాను. ఇప్పుడు నా లక్ష్యం ఒకటే, ఈ పిల్లల్ని నా స్వశక్తితో పెంచి పెద్దచేయాలి! నర్సింగ్ యమర్జన్సీ కోర్సుకు అప్లైచేశాను. శిక్షణ పూర్తయ్యాక వచ్చి పిల్లల్ని పిల్చుకవెడతాను. అందాకా నాపిల్లలుగారు వీళ్లు నీ పిల్లలు—ఎక్కడున్నా ఎలావున్నా నా భర్త గోపాలరావ్!'' వసుంధర దుఃఖం ఆపటం కష్టమనిపించింది.

*　　　*　　　*

''పిల్లలు జాగ్రత్త గాయత్రీ! బాబు ఎక్కువ మారాం చేసి విసిగిస్తాడేమో నిన్ను... పాప బెంగ పెట్టుకుంటుంది కాబోలు...'' వసుంధర సజలనేత్రాలూ, తల్లిగా, పిల్లలను విడువలేని ఆవేదనా చూస్తుంటే నా హృదయం తల్లడిల్లి పోతూంది....

''వసూ! నా గుండెల్లో దాచుకుంటాను నీ పిల్లల్ని!'' అన్నాను కన్నీళ్ళు ఆగకుండా ప్రవహిస్తుంటే!

"అన్నయ్యగారూ వెళ్లొస్తాను! వస్తా గాయత్రీ!" రిక్షా కనుమరుగయ్యింది!

వారు బాబునూ, నేను పాపనూ సముదాయించటంలో మునిగిపోయాం! కానీ వసుంధర మాటలింకా చెవుల్లో ప్రతి ధ్వనిస్తున్నాయి.

"ఈనాడు త్రిశంకు స్వర్గంలా వున్న మన సమాజంలో, ఎన్ని చట్టాలొచ్చినా, ఎంత ప్రగతి సాధించామని గొంతు చించుకున్నా, స్త్రీ జీవితం ఆద్యంతాలమధ్యే వుంటోంది గాయత్రీ! అటు పూర్వపు తరాల్లో కలవలేకా, ఇటు ప్రగతి పంథాలో ధైర్యంగా సాగలేకా!"